

బైబై గణేశ

సాగరతీ రాల్లో నిమజ్జనాలు - భారీగా పోలీసు బందోబస్తు






వినాయక చవితి సందర్భంగా నగర వ్యాప్తంగా వివిధ సంఘాల ఆధ్వర్యంలో వేర్వేరు ప్రాంతాల్లో 1,519 భారీ విఘ్నేశ్వరుడి విగ్రహాలను కొలువుదీర్చారు. నాలుగు రోజులు విశేష పూజల అనంతరం ఆదివారం నిమజ్జనం భారీస్థాయిలో సాగింది. గ్రేటర్ చెన్నై పోలీసుశాఖ నిమజ్జన ఊరేగింపు సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా 16,500 మంది పోలీసులు, మరో 2వేల మంది హోంగార్డులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొచ్చి పోలీసులు అనుమతించిన సముద్రతీరాల్లో నిమజ్జనం చేశారు. - ప్యారీస్, ఆంధ్రజ్యోతి

జర్మనీలో సీఎం స్టాలిన్‌కు అపూర్వ స్వాగతం

● ఎయిర్‌పోర్ట్‌లో తమిళ కుటుంబాల సందడి





విమానాశ్రయం వద్ద చంటిబిడ్డను చంకనెత్తుకున్న సీఎం - జర్మనీ పర్యటనకు వచ్చిన స్టాలిన్ నాన్నకు స్వాగతం అంటూ ప్లకార్డ్ ప్రదర్శిస్తున్న చిన్నారులు

చెన్నై, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): విదేశీ పెట్టుబడుల సమీకరణ కోసం జర్మనీ, ఇంగ్లాండ్ పర్యటనకు బయలుదేరిన ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌కు జర్మనీ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద అపూర్వ స్వాగతం లభించింది. జర్మన్ రాయబార వ్యవహారాల ప్రోటోకాల్ డివిజన్ అధికారిని అంజా డీ వెర్త్, భారతీయ రాయబారి అభిషేక్ దూబే, ఫ్రాంక్‌ఫర్ట్ యాక్టింగ్ కాన్సుల్ జనరల్ ఆఫ్ ఇండియా విభాకాంత్ శర్మ ఇతర అధికారులు స్టాలిన్‌కు ఘన స్వాగతం పలికారు. విమానాశ్రయం వద్ద అక్కడి తమిళ్ వయాస్ పోరా సభ్యులైన తమిళ కుటుంబీకులు, బాలబాలికలు స్టాలిన్ దంపతులకు ఘనస్వాగతం పలికారు. జర్మన్ పర్యటనకు విచ్చేసిన స్టాలిన్ నాన్నకు స్వాగతం అంటూ ప్లకార్డులతో చిన్నారులకు ఆయనకు స్వాగతం పలికారు. ఆ సందర్భంగా స్టాలిన్ ఓ చంటి బిడ్డను ఎత్తుకున్నారు.. అదే సమయంలో అక్కడి తమిళ కుటుంబీకులు ఆయనతో సెల్ఫీలు తీసుకునేందుకు పోటీపడ్డారు. ఆదివారం సాయంత్రం జర్మనీలోని తమిళ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి స్టాలిన్ దంపతులు పాల్గొన్నారు. సోమవారం ఉదయం జరుగనున్న పెట్టుబడిదారుల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించనున్నారు. ఆ సమయంలో కొన్ని కంపెనీలతో అవగాహన ఒప్పందం కుదుర్చుకునే అవకాశాలు కూడా ఉన్నాయి.

మనసు పాటలతో మానసిక ఒత్తిడి మటుమాయం

● వేదవిజ్ఞానవేదిక సభలో డాక్టర్ రామసుబ్బారెడ్డి



డాక్టర్ రామ సుబ్బారెడ్డిని సత్కరిస్తున్న జేకే రెడ్డి, కందనూరు మధు, ఆచార్య సీఎంకే రెడ్డి

వేళచ్చేరి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సంగీత, సాహిత్యాలకు, మనిషి భావోద్వేగాలకు ఎంతో సంబంధముందని, మంచి సంగీతం, పాటలు మానసిక ఒత్తిడి తగ్గించి ప్రశాంతతను చేకూర్స్తాయని విజయవాడకు చెందిన ప్రముఖ మానసిక వైద్యనిపుణులు, రచయిత డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి అన్నారు. వేదవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో తరతరాల తెలుగు కవిత ఉపన్యాస ధారావాహిక 164వ ప్రసంగ కార్యక్రమంగా 'తెలుగు సినిమాలలో మనసు పాటలు' అనే అంశంపై దృశ్య శ్రవణ విధానంలో ఆయన ప్రసంగించారు. టి.నగర్ ఆంధ్రాక్లబ్, కృష్ణాహాలులో ఆదివారం సాయంత్రం అరుణా శ్రీనాథ్ ప్రార్థనతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో వక్త డా. ఇండ్ల రామసుబ్బారెడ్డిని వేదిక అధ్యక్షుడు జేకే రెడ్డి సభకు పరిచయం చేశారు. విజయవాడలో నాలుగు దశాబ్దాల క్రితం ఇండ్లాస్ హాస్పిటల్స్ స్థాపించి లక్షలాదిమందికి మానసిక రుగ్మతలపై చికిత్స అందించారని, ఎన్నో పరిశోధక వ్యాసాలు రాశారని, పలు సీరియల్స్‌లో మానసిక వైద్యుడిగాను నటించారని తెలిపారు. వక్త రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ మనసు పాటలు, మనసుల్ని కదిలిస్తాయని, గతస్మృతులను గుర్తుచేసి మనసులోని భారాన్ని తగ్గించేందుకు దోహద పడతాయన్నారు. 'మనసు కవి' ఆత్రేయ వందకు పైగా మనసు పాటలు రాసి ప్రపంచంలోనే అత్యధిక మనసు పాటల గేయ రచయితగా ప్రసిద్ధిచెందారన్నారు. తమిళంలో మనసు పాటలు రాసిన కన్నదాసన్ కంటే మిన్నగా ఆత్రేయ మనసు పాటలు రాశారన్నారు. అభ్యుదయ కవి శ్రీశ్రీ కూడా అద్భుతమైన కొన్ని మనసు పాటలు రాశారన్నారు. చివరి రోజుల్లో ఆస్తికత్వం వైపు మొగ్గిన ఆత్రేయ, తనలోని నాస్తికత్వానికి ప్రతీకగా 'భక్తతుకారం' చిత్రంలో 'ఉన్నావా... అసలున్నావా... అంటూ పాటలో దేవుడిపైన నిందాస్తుతిని చెప్పుకనే చెప్పారన్నారు. దాదాపు 30 మనసు పాటలను దృశ్య శ్రవణ మాధ్యంలో సభకు వివరిస్తూ డాక్టర్ రామసుబ్బారెడ్డి చేసిన ప్రసంగం అందరిని ఆకట్టుకుంది. చివరగా డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డిని నిర్వాహకులు ఘనంగా సత్కరించి జ్ఞాపికను బహూకరించారు.



సభకు హాజరైన తెలుగు ప్రముఖులు, సాహితీ అభిమానులు

రక్తదానం... కుటుంబానికి ఊపిరి పోస్తుంది

● ఆస్కా పూర్వ అధ్యక్షుడు కె.సుబ్బారెడ్డి ● చెన్నై 'జనసేన' ఆరోగ్య శిబిరానికి భారీ స్పందన

అడయార్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ఒక మహత్తరమైన కార్యక్రమం అని, రక్తం దానం ఒక మనిషికి జీవితాన్నిస్తుంది, ఒక కుటుంబానికి ఊపిరిపోస్తుందని ఆస్కా పూర్వ అధ్యక్షుడు, పల్లవా గ్రానైట్ అధినేత కె.సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఏపీ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత, సినీ నటుడు పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు వేడుకల (సెప్టెంబరు 2)ను పురస్కరించుకుని నగరంలోని ప్రముఖ కార్పొరేట్ ఆస్పత్రి సిమ్స్ సహకారంతో జనసేన పార్టీ చెన్నై విభాగం కన్వీనర్. ఏ.తమ్మయ్య నేతృత్వంలో ఆదివారం మెగా ఆరోగ్య, రక్తదానం శిబిరాలు జరిగాయి. టి.నగర్, విజయరాఘవ రోడ్డులో ఉన్న ఆస్కా ప్రాంగణం, గోదావరి హాలులో ఏర్పాటు చేయగా, ఈ ఆరోగ్య, రక్తదాన శిబిరానికి నగరవాసుల నుంచి అపూర్వ స్పందన వచ్చింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆస్కా మాజీ అధ్యక్షుడు కె.సుబ్బారెడ్డి, గౌరవ అతిథులుగా ప్రముఖ సినీ నిర్మాత ఏ.ఎం.రత్నం, ఏపీ హ్యాండీక్రాఫ్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కె.సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఈ మెగా వైద్య, రక్తదానం శిబిరం ఒక మహత్తరమైన కార్యక్రమాలని, పవన్ కళ్యాణ్ మనస్తత్వానికి చాలా దగ్గరైనవన్నారు. 'మహత్తరమైన' అనే మాటను అనడానికి కారణం లేకపోలేదన్నారు. భోజనం పెట్టిస్తే ఒక పూట ఆకలి తీరుతుందని, ఆర్థిక సాయం చేసే కొన్ని రోజుల పాటు మనిషి అవసరాలు తీరుతాయన్నారు. కానీ, రక్తదానం చేస్తే మాత్రం ఒకరికి ప్రాణం పోస్తుందని, ఒక మనిషికి జీవితాన్నిస్తుందని, ఒక కుటుంబానికి ఊపిరి పోస్తుందన్నారు. అంతటి గొప్ప కార్యక్రమం కాబట్టే ఈ కార్యక్రమాన్ని మహత్తరమైనదిగా అభివర్ణించినట్టు వివరించారు. పవన్ ఆశయాలకు అనుగుణంగా జనసేన చెన్నై విభాగం కన్వీనర్ తమ్మయ్య సారథ్యంలోని బృందం ఇలాంటి మెగా ఆరోగ్య, రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సినీ నిర్మాత ఏ.ఎం.రత్నం మాట్లాడుతూ, పవన్ పుట్టిన సందర్భంగా ఈ తరహా కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందని, మున్ముందు మరెన్నో కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపు నిచ్చారు.. ఏపీ హ్యాండీక్రాఫ్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్ మాట్లాడుతూ, వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి వందల మందికి వైద్య పరీక్షలు చేయించేలా ఏర్పాట్లు చేసిన తమ్మయ్య బృందానికి అభినందనలు తెలుపుతూ, ఇందులో పాల్గొనే అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలన్నారు. జనసేన చెన్నై విభాగం కన్వీనర్ ఏ.తమ్మయ్య మాట్లాడుతూ, సిమ్స్ యాజమాన్యం, వైద్యుల సహకారంతో ఈ మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని, పాల్గొన్న వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.





సభలో పాల్గొన్న కే సుబ్బారెడ్డి, నిర్మాత ఏఎం రత్నం తదితరులు - ఓ మహిళకు కంటి పరీక్ష చేస్తున్న వైద్యనిపుణులు

ఇన్‌ఛార్జి డీజీపీగా వెంకట్రామన్



బాధ్యతలు స్వీకరిస్తున్న జి.వెంకట్రామన్

చెన్నై, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాంతి భద్రతల విభాగం ఇన్‌ఛార్జి డీజీపీగా సీనియర్ ఐపీఎస్ అధికారి జి.వెంకట్రామన్ ఆదివారం మధ్యాహ్నం పదవీ స్వీకారం చేశారు. డీజీపీగా పదవీ విరమణ చేస్తున్న శంకర్ జివాల్ నుండి ఆయన బాధ్యతలు స్వీకరించారు. అడ్మినిస్ట్రేటివ్ డిపార్ట్‌మెంట్ స్పెషల్ డీజీపీగా వ్యవహరిస్తున్న వెంకట్రామన్‌ను శాంతి భద్రతల విభాగం ఇన్‌ఛార్జి డీజీపీగా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఆ మేరకు డీజీపీ ప్రధాన కార్యాలయంలో వెంకట్రామన్ ఇన్‌ఛార్జి డీజీపీగా బాధ్యతలు స్వీకరించారు. నాగపట్టినం ప్రాంతానికి చెందిన వెంకట్రామన్ 1968లో జన్మించారు. 1994లో యూపీఎస్సీలో ఉత్తీర్ణులై రాష్ట్ర కేడర్‌లో ఐపీఎస్ అధికారిగా ఎంపికయ్యారు. అవినీతి నిరోధక విభాగం డీఐజీగా, ఐజీగా సమర్థవంతంగా పనిచేశారు. ఆ తర్వాత సీబీసీఐడీ, సైబర్ క్రైం విభాగాల్లో కీలకమైన పదవుల్లో సేవలందించారు. గత యేడాది డిసెంబర్‌లో డీజీపీగా పదోన్నతి పొందారు. ప్రస్తుతం ఇన్‌ఛార్జి డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన వెంకట్రామన్‌కు సహోద్యోగులు పూల బొకేలు అందించి అభినందనలు తెలిపారు. ఇదిలా ఉండగా ఆదివారం సాయంత్రం పదవీ విరమణ చేసి రాష్ట్ర ఫైర్ కమిషన్ తొలి కమిషనర్‌గా నియమితులైన శంకర్‌జివాల్‌కు డీజీపీ కార్యాలయం వద్ద సిబ్బంది సత్కరించి ఘనంగా వీడ్కోలు పలికారు. శంకర్ జివాల్‌ను కారులో కూర్చోబెట్టి కారు ముందు ఇరువైపులా మోకుతాళ్లు కట్టి రథాన్ని లాగుతున్నట్లు కొంతదూరం వరకూ లాగి ఆయన పట్ల తమకున్న వినయవిధేయతలను చాటుకున్నారు.

ఆమరణ దీక్షకు అంతరాయం
క్షీణించిన ఎంపీ శశికాంత్ ఆరోగ్యం



తిరువళ్లూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కాంగ్రెస్ ఎంపీ శశికాంత్ సెంథిల్

చెన్నై, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి రావాల్సిన విద్యానిధులను విడుదల చేయని కేంద్ర ప్రభుత్వ వైఖరి ఖండిస్తూ గత మూడు రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న తిరువళ్లూరు ఎంపీ శశికాంత్ సెంథిల్ ఆరోగ్యపరిస్థితి విషమించడంతో ఆయనను నగరంలోని జీహెచ్‌కు తరలించారు. తిరువళ్లూరులోని రాజీవ్‌భవన్ వద్ద శుక్రవారం ఉదయం ఆయన ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించారు. శనివారం మధ్యాహ్నం శశికాంత్ సెంథిల్‌కు బీపీ ఎక్కువ కావడంతో చికిత్స నిమిత్తం తిరువళ్లూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స జరుగుతున్నప్పుడు కూడా ఆయన దీక్ష కొనసాగించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి కాస్త కుదుటపడటంతో వైద్యుల సలహా తోసిపుచ్చి ఆయన మళ్లీ నిరాహార దీక్షకు దిగారు. ఆదివారం ఉదయం దీక్షను కొనసాగిస్తుండగా హృదయస్పందనలో తేడా గమనించిన వైద్యులు ఆయనను మెరుగైన వైద్యం కోసం చెన్నై జీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం జీహెచ్‌లో ఆయనకు వైద్యనిపుణులు చికిత్సలందిస్తున్నారు. ఇదిలా ఉండగా కాంగ్రెస్ ఎంపీ శశికాంత్ సెంథిల్ ఆమరణ నిరాహార దీక్షకు ప్రముఖ సినీనటుడు ప్రకాష్‌రాజ్ మద్దతు ప్రకటించారు. విద్యాహక్కుల సాధన దిశగా, బాలబాలికల విద్యకు సంబంధించిన నిధుల కోసం ఆందోళనకు దిగిన శశికాంత్ సెంథిల్‌కు తాము అండగా ఉంటామని ఆయన తన ఎక్స్‌పేజీలో పోస్టు చేశారు.

నగరంలో తొలిసారి మేఘ విస్ఫోటనం

● మణలిలో 27 సెం.మీ.ల వర్షం



మధురవాయిల్ - నోలంబూరు ప్రాంతంలోని కల్వర్టు వద్ద వర్షపునీరు

చెన్నై, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతమైన మణలి వద్ద శనివారం అర్ధరాత్రి మేఘ విస్ఫోటనం కారణంగా 27 సెం.మీ వర్షపాతం నమోదైనట్లు స్థానిక వాతావరణ పరిశోధన కేంద్రం అధికారులు ప్రకటించారు. శనివారం సాయంత్రం ఆరుగంటల ప్రాంతంలో నగరమంతటా మేఘావృతమై రాత్రి 10 గంటల సమయంలో ఉరుములు, మెరుపులతో కుండపోతగా వర్షం కురిసింది. మణలి, కొరట్టూరు, అంబత్తూరు, ఆవడి, కత్తివాక్కం, తిరువొత్తియూరు, అయ్యపాకం, కొళత్తూరు, రెడ్‌హిల్స్, కాశిమేడు, అయనవారం, పెరంబూరు, వ్యాసర్పాడి, మాధవరం, వలసరవాక్కం, పోరూరు, కోయంబేడు, పూందమల్లి, అమింజికరై, కోడంబాక్కం, చూళైమేడు, ఎగ్మూరు, చెట్‌పట్, వెస్ట్‌మాంబళం, టి.నగర్, గిండి, పల్లావరం, తాంబరం, తిరువాన్మియూరు, అడయారు, మైలాపూరు, రాయపేట, వేళచ్చేరి, తురైపాక్కం తదితర ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురిశాయి. రాత్రి 10 నుండి 12 గంటల వరకు మణలి అధికంగా 27 సెం.మీల వర్షపాతం నమోదైంది. మేఘ విస్ఫోటనం కారణంగానే భారీ వర్షం కురిసిందని అధికారులు చెబుతున్నారు. వాతావరణ పరిశోధన కేంద్రం అధికారుల సమాచారం ప్రకారం గంటలోగా 10 సెం.మీల వర్షం కురిస్తే ఆ ప్రాంతంలో మేఘ విస్ఫోటనం జరిగినట్లు భావిస్తారు. మణలి పుదునగర్‌లో 26 సెం.మీ.లు, విమ్కోనగర్‌లో 23 సెం.మీల వర్షపాతం నమోదైయ్యాయి. గత 24 గంటల వ్యవధిలో కొరట్టూరులో 18.8 సెం.మీలు, కత్తివాక్కంలో 13.9 సెం.మీలు, ప్యారీస్‌కార్నర్‌లో 12.1 సెం.మీల వర్షపాతం నమోదైంది. ఈ భారీ వర్షం కారణంగా మణలి, కత్తివాక్కం, ఎన్నూరు, కోయంబేడు, మధురవాయల్ తదితర ప్రాంతాల్లో పల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. రహదారులలో మోకాలి లోతున వర్షపు నీరు వరదలా ప్రవహించింది.

సమాచార దర్శిని

రేపు విద్యుత్ గ్రీవెన్స్

పెరంబూర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక మైలాపూర్, తండయార్‌పేట, అంబత్తూర్, కేకే నగర్ మండలాల్లో మంగళవారం ఉదయం 11 గంటల నుంచి విద్యుత్ వినియోగదారుల సమావేశం జరుగనుంది. ఈ మేరకు విద్యుత్ బోర్డు విడుదల చేసిన ప్రకటనలో.. మైలాపూర్ పరిధిలో వళ్లువర్‌కోట్టం ఉప విద్యుత్ కేంద్రం, అంబత్తూర్ పరిధిలో మూడవ మెయిన్ రోడ్డు సమీపంలోని ఉప విద్యుత్ కేంద్రం, తండయార్‌పేట పరిధిలో టీహెచ్ రోడ్డులోని మండల కార్యాలయం, కేకే నగర్ పరిధిలో కేకే నగర్ ఉప విద్యుత్ కేంద్రం ప్రాంగణంలోని నిర్వహణ ఇంజనీర్ కార్యాలయాల్లో విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేసి పరిష్కారం పొందవచ్చని విద్యుత్ బోర్డు తెలిపింది.

రాష్ట్రపతి పర్యటన సందర్భంగా 2, 3 తేదీల్లో డ్రోన్ల నిషేధం

పెరంబూర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన సందర్భంగా ఈనెల 2,3 తేదీల్లో నగరంలో డ్రోన్ ఎగురవేతపై నిషేధం విధిస్తూ నగర పోలీస్ కమిషనర్ అరుణ్ ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ఈ నెల 2వ తేది మధ్యాహ్నం నందనంలోని చెన్నై ట్రేడ్ సెంటర్‌లో సిటీ యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమానికి హాజరుకానున్నారు. రాత్రి గిండి రాజ్‌భవన్‌లో రాష్ట్రపతి బస చేయనున్నారు. 3వ తేదీ విమానంలో తిరుచ్చి వెళ్లనున్నారు. రాష్ట్రపతి పర్యటన సందర్భంగా నగరంలో గస్తీ ముమ్మరం చేశారు. విమానాశ్రయం, చెన్నై ట్రేడ్ సెంటర్, రాజ్ భవన్, రాష్ట్రపతి వాహనం వెళ్లే మార్గాలను 'రెడ్ జోన్లుగా' ప్రకటించారు. అలాగే, ఆయా ప్రాంతాల్లో 2,3 తేదీల్లో డ్రోన్ కెమెరాలు, ఎలాంటి పరికరాలు ఎగురవేయడంపై నిషేధం విధిస్తూ పోలీసు శాఖ ఉత్తర్వులు జారీచేసింది.

విద్యుదుత్పత్తికి అంతరాయం

పెరంబూర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా అత్తిపట్టులో ఉత్తర చెన్నై విస్తరణ థర్మల్ విద్యుత్ కేంద్రం ఉంది. ఈ కేంద్రంలో తలా 600 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండు యూనిట్లు పనిచేస్తున్నాయి. ఈ క్రమంలో, కేంద్రంలోని ఒకటో యూనిట్‌లో బాయిలర్ ట్యూబ్ పంచర్ కారణంగా శుక్రవారం వేకువజాము నుంచి విద్యుదుత్పత్తి అంతరాయం కలిగింది. మరమ్మతులు పూర్తిచేసి త్వరలో ఉత్పత్తి ప్రారంభిస్తామని విద్యుత్ బోర్డు అధికారులు తెలిపారు.

47.97 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు

పెరంబూర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సీజన్‌లో, ఇప్పటివరకు ఎన్నడూ లేని విధంగా 5.13 లక్షల రైతుల నుంచి 47.97 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. కేంద ప్రభుత్వ ఆధ్వర్యంలో, రాష్ట్ర రైతుల నుంచి రాష్ట్ర ప్రభుత్వ వినియోగదారుల వాణిజ్య సంస్థ ధాన్యం కొనుగోలు చేస్తోంది. 2024 సెప్టెంబరు 1 నుంచి ప్రారంభమైన ధాన్యం కొనుగోలు సీజన్ ఆదివారంతో ముగిసింది. శనివారం వరకు 47.97 లక్షల టనులుఉ కొనుగోలు చేశారు. అందుకోసం 5.13 లక్షల మంది రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో గిట్టుబాటు ధరగా రూ.11,660 కోట్లు అందజేశారు. సోమవారం నుంచి కొత్త గిట్టుబాటు ధరలతో తదుపరి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

నేటినుంచి నగరంలో టీ రూ.15

పెరంబూర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నగరంలో సోమవారం నుంచి టీ, కాఫీ ధరలు పెంచనున్నట్లు టీ వ్యాపారుల సంఘం ప్రకటించింది. పాలు, కాఫీ, టీ పొడి తదితర ముడిసరుకుల ధరలు పెరుగుదల కారణంగా టీ, కాఫీ ధరలు పెంచాలని నిర్ణయించారు. ఆ ప్రకారం, రూ.12కు విక్రయిస్తున్న టీ రూ.15, రూ.15కు విక్రయిస్తున్న కాఫీ రూ.20కి పెంచుతున్నట్లు టీ దుకాణాల వ్యాపారుల సంఘం తెలిపింది.


22 నుంచి దేవాంగ యువజన సంఘం దసరా ఉత్సవాలు

అడయార్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఓల్డ్ వాషర్‌మెన్‌పేట పేరంబాలు వీధిలో ఉన్న దేవాంగ యువజన విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీ నుంచి దసరా ఉత్సవాలు జరుగనున్నాయి. 22 సోమవారం నుంచి అక్టోబరు ఒకటో తేదీ బుధవారం వరకు వేడుకలను నిర్వహిస్తామని విజయదశమి మహోత్సవ నిర్వాహక సమితి ఆదివారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పేర్కొంది. ఈ వేడుకల్లో భాగంగా బాలవినాయక చాముండేశ్వరీ ప్రసన్న వేంకటేశ్వర కోదండరామస్వామి దేవస్థాన ప్రాంగణంలోని చాముండేశ్వరీ దేవి వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. 2వ తేదీ నాప రామలింగం అమ్మవారికి చందన అలంకార వేడుకను నిర్వహిస్తారు.

4,946 రోడ్ల పునరుద్ధరణ పనులు పూర్తి

పెరంబూర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పరిధిలో 1,951 రోడ్ల అభివృద్ధి, 2,995 రోడ్ల పునరుద్ధరణ పనులు పూర్తయినట్లు జీసీసీ ఒక ప్రకటనలో తెలిపింది. జీసీసీ పరిధిలో 488 బస్సు రోడ్లు, 35,978 అంతర్గత రోడ్లున్నాయి. వీటిలో 648.78 కి.మీ 3,987 రోడ్ల అభివృద్ధికి రూ.489.22 కోట్లు కేటాయించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఇప్పటివరకు బస్సు, అంతర్గత రోడ్లు 1,951, తాగునీటి పైపులు, విద్యుత్ కేబుళ్ల ఏర్పాటుకు గుంతలు తవ్విన 2,995 రోడ్లు పునరుద్ధరించినట్లు, మిగిలిన పనులు సెప్టెంబరు 15వ తేదీలోపు ముగించాలని నిర్ణయించినట్లు జీసీసీ తెలిపింది.

శ్రీవారి సేవలో ప్రముఖులు



ఏకేఎస్ విజయన్

తిరుమల, ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్, తమిళనాడు ప్రభుత్వం ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి ఏకేఎస్ విజయన్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

కారును ఢీకొన్న మినీలారీ

ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు సహా నలుగురి దుర్మరణం



ప్రమాదంలో దెబ్బతిన్న వాహనాలు

చెన్నై, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లా పరమక్కుడి సమీపంలో ఆదివారం వేకువజాము సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు సహా నలుగురు మృతి చెందగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. రామనాథపురం చెట్టియార్ వీధిలో నివసిస్తున్న గోవిందరాజ్ (65) తన కుటుంబ సభ్యులు జమున (55), రూపిణి (30), చరణ్‌రాజ్ (30)తో కారులో కుట్రాలం జలపాతానికి బయలుదేరారు. మణక్కుడికి చెందిన కాళీశ్వరన్ (28) నడుపుతున్న కారు మదురై -రామేశ్వరం జాతీయ రహదారిలో పరమక్కుడి సమీపం నెన్మేణి అనే ప్రాంతం వద్ద వేకువజాము 2 గంటల ప్రాంతంలో వెళ్తుండగా మదురై నుండి వస్తున్న ఓ మినీ లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న జమున, రూపిణి, డ్రైవర్ కాళీశ్వరన్ ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. తీవ్రంగా గాయపడిన గోవిందరాజ్, శరణ్‌రాజ్‌లను చికిత్స నిమిత్తం మదురై ఆస్పత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స ఫలించక గోవిందరాజ్ మృతి చెందాడు. మినీ లారీలో ప్రయాణించిన డ్రైవర్ ముత్తురాజా (23), నాగనాథన్ (47) జయమాల (44) గాయపడ్డారు. వీరికి పరమక్కుడి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం మదురై ఆసుపత్రికి తరలించారు. పరమక్కుడి తాలూకా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా కేకే నగర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుంది. గాంధీ నగర్, సంజయ్ గాంధీ నగర్, ఇళంగో నగర్, ఇందిరా నగర్, రాజీవ్ గాంధీ నగర్, పెరియార్ నగర్, కన్నగి వీధి, ఎంజీఆర్ వీధి, సాధిక్‌భాషా నగర్, ఏరిక్కరై వీధి, పోస్టల్ ఆడిట్ కాలని, సాయి నగర్, వెంకటేశ్వర నగర్ మరియు ఎక్స్‌టెన్షన్, భాస్కర్ కాలనీతో పాటు, వేద నగర్, మునియప్ప నగర్, వల్లియమ్మాళ్ నగర్, మల్లిగై అవెన్యూ, తిరువళ్లువర్ కాలని, అన్నామ్మాళ్ నగర్, నెర్కుంద్రం మెయిన్ రోడ్డు ఉన్నాయి. అదేవిధంగా చిత్తిరై వీధి, వైకాసి వీధి, పంగుణి వీధి, మాసి వీధి, నటేశన్ నగర్, గంగై అమ్మన్ ఆలయ వీధి, పచ్చయమ్మన్ ఆలయ వీధి, శక్తి నగర్, సాయిబాబా కాలని, కాళి అమ్మన్ ఆలయ వీధి, ఎల్ అండ్ టీ కాలని, రత్న నగర్, స్వర్ణాంబిగై నగర్, వెంకటేష్ నగర్, తారాచంద్ నగర్, కామరాజర్ రోడ్డు, కంబర్ వీధి మరియు గార్డన్, వినాయగం వీధి, సాయి నగర్, భారతి వీధి, అయ్య నగర్ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

దక్షిణ జిల్లాలకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనపు బోగీలు

చెన్నై, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): తాంబరం-సెంగోట్టై, తాంబరం-నాగర్‌కోయిల్ తదితర రైళ్లకు అదనపు బోగీలు అనుసంధానం చేయనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ఆ ప్రకారం, తాంబరం నుంచి సెంగోట్టై వెళ్లే సూపర్ ఫాస్ట్ రైలు (నెం.20681), నాగర్‌కోయిల్ ఎక్స్‌ప్రెస్ (నెం.22657) శనివారం నుంచి అక్టోబరు 30 వరకు, మరుమార్గంలో సెంగోట్టై, నాగర్‌కోయిల్ నుంచి తాంబరం వెళ్లే (నెం.20682, 22658) రైళ్లకు రెండు 2 టైర్ ఏసీ బోగీలు, 2 తీ టైర్ ఏసీ బోగీలు, 3 స్లీపర్ క్లాస్ బోగీలు, ఒక సెకండ్ క్లాస్ బోగీ అనుసంధానం చేయనున్నారు. అలాగే, చెన్నై సెంట్రల్ నుంచి ప్రతిరోజు రాత్రి 8.55 గంటలకు ఆలంపులై వెళ్లే సూపర్ ఫాస్ట్ రైలు (నెం.22639)కు శుక్రవారం నుంచి అక్టోబరు 30 వరకు, మరుమార్గంలో, అలంపుళా నుంచి ప్రతిరోజు మధ్యాహ్నం 3.20 గంటలకు చెన్నై సెంట్రల్ చేరే (నెం.22640) సూపర్ ఫాస్ట్ రైలుకు శనివారం నుంచి నవంబరు 1 వరకు ఒక 2 టైర్ ఏసీ బోగీ అనుసంధానం చేయనున్నారు. ఇక, చెన్నై సెంట్రల్ నుంచి ప్రతిరోజు మధ్యాహ్నం 3.20 గంటలకు తిరువనంతపురం వెళ్లే (నెం.12695) సూపర్ ఫాస్ట్ రైలుకు ఆదివారం నుంచి నవంబరు 2 వరకు, మరుమార్గంలో, తిరువనంతపురం నుంచి ప్రతిరోజు సాయంత్రం 5.15 గంటలకు బయల్దేరే (నెం.12696) సూపర్ ఫాస్ట్ రైలుకు సెప్టెంబరు 1 నుంచి నవంబరు 3 వరకు ఒక 2 టైర్ ఏసీ బోగీ అనుసంధానం చేయనున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది.

7 సంపూర్ణ చంద్రగ్రహణం

- తిరుచెందూర్‌లో పగటిపూట దర్శనాలు రద్దు

ప్యారీస్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 7వ తేదీ సంపూర్ణ చంద్రగ్రహణాన్ని పురస్కరించుకుని తూత్తుకుడి జిల్లాలోని తిరుచెందూర్ సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో పూజల సమయాన్ని మార్పు చేశారు. ఆ రోజు మధ్యాహ్నం 2 గంటల వరకే భక్తులను దర్శనానికి అనుమతించనున్నట్లు ఆలయ నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7వ తేదీ రాత్రి 9.58 గంటలకు మొదలయ్యే చంద్రగ్రహణం అర్ధరాత్రి దాటిన తరువాత 1.26 గంటల వరకు ఉంటుంది. ఈ చంద్రగ్రహణాన్ని పురస్కరించుకుని ఆ రోజు తెల్లవారుజాము 4 గంటల నుండి పూజలు ప్రారంభమవుతాయి. 4.30 గంటలకు విశ్వరూప దీపారాధన, ఉదయం 6 గంటలకు ఉదయ మార్తాండాభిషేకం, 10 గంటలకు ఉచ్చికాలాభిషేకం, మధ్యాహ్నం 12 గంటలకు సాయరక్షా, 3 గంటలకు రాహుకాల అభిషేకం పూజలు నిర్వహిస్తారు. భక్తులను మధ్యాహ్నం 2 గంటల వరకు క్యూలైన్ల ద్వారా దర్శనానికి అనుమతించనున్నట్లు ఆ ప్రకటనలో తెలిపారు.

ఆర్కేపేట అన్నాడీఎంకేలో చేరిన యువత



అన్నాడీఎంకేలో చేరిన యువకులతో పార్టీ నిర్వాహకులు

తిరుత్తణి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి నియోజకవర్గం పరిధిలోని ఆర్కేపేట యూనియన్‌లో పలు పార్టీలకు చెందిన వందమంది యువకులు అన్నాడీఎంకేలో చేరారు. మండల కార్యదర్శి పెరుమాళ్ నేతృత్వంలో జరిగిన కార్యకర్తల సమీక్షా సమావేశంలో అరక్కోణం మాజీ ఎంపీ జి.హరి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో రాష్ట్రం ఆర్థికంగా అభివృద్ధి చెందిందని, పార్టీ ప్రధాన కార్యదర్శి ఈపీఎస్ ప్రవేశపెట్టిన పథకాలనే పేర్లు మార్చి డీఎంకే అమలుపరుస్తుందని మండిపడ్డారు. 2026లో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకేను గెలిపించి ఎడప్పాడి పళనిస్వామిని ముఖ్యమంత్రిని చేసే బాధ్యత ప్రజలదేనన్నారు. కార్యక్రమంలో అన్నాడీఎంకే మండల కార్యదర్శి నాగపూండి కుమార్, జిల్లా విద్యార్థి సంఘం కార్యదర్శి జయశేఖర్‌బాబు, నగర యువజన సంఘం కార్యదర్శులు కేబుల్ సురేష్, అగథియన్ సహా పలు విభాగాలకు చెందిన నిర్వాహకులు పాల్గొన్నారు.

విజయ్ నేతృత్వంలో కొత్త ఫ్రంట్ : టీటీవీ దినకరన్

ప్యారీస్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీకి వచ్చే ఏడాదిలో జరగనున్న ఎన్నికలకు తమిళగ వెట్రిక కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ నేతృత్వంలో కొత్త ఫ్రంట్ ఏర్పాటవుతోందని అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం (ఏఎంఎంకే) ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ పేర్కొన్నారు. 2026 అసెంబ్లీ ఎన్నికలకు తమిళ రాజకీయాల్లో నాలుగు ఫ్రంట్‌లు ఢీకొనే అవకాశముంది. ప్రధాన పార్టీలైన డీఎంకే, అన్నాడీఎంకేల సారథ్యంలో కూటమి లు ఏర్పాటయ్యాయి. కాగా, నామ్ తమిళర్ కట్చి ఒంటరిగా బరిలో దిగుతుందని ఆ పార్టీ ఆర్గనైజర్ సీమాన్ ఇంతకు ప్రకటించారు. విజయ్ నేతృత్వంలోని టీవీకే కూడా పొత్తులపై ఇప్పటివరకు స్పష్టమైన ప్రకటన విడుదల చేయలేదు. డీఎండీకే, పీఎంకే పార్టీలు కూడా ఏ కూటమిలో చేరాలనే దానిపై నిర్ణయం తీసుకోలేదు. జనవరి తర్వాత ఈ రెండు పార్టీలు కూటమి గురించి నిర్ణయం తీసుకునే అవకాశముంది. ఈ నేపథ్యంలో ఆదివారం పరమకుడిలో ఏర్పాటు చేసిన ఏఎంఎంకే నిర్వాహకుల సమావేశంలో టీటీవీ దినకరన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ 2026 అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ నేతృత్వంలో కొత్త ఫ్రంట్ ఏర్పాటవుతోందని, తమ పార్టీ ఏ ఫ్రంట్‌లో ఉంటుందో త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.

మరణించినా వారు చిరంజీవులు

- ఇద్దరు బాలికల అవయవదానం





ఓవియా, రిషియా (ఫైల్‌ఫొటోలు)

పెరంబూర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మెదడు నిర్జీవమైన ఏడేళ్ల, 18 ఏళ్ల బాలికలు అవయవదానం ద్వారా పలువురికి పునర్జన్మ ప్రసాదించారు. కరూర్ జిల్లా అరవకుర్చికి చెందిన ఓవియ (7) ఘటన జరిగిన రోజున తమ మామతో ద్విచక్రవాహనంపై వెళ్తోంది. స్పీడ్ బ్రేకర్ వద్ద సడన్ బ్రేక్ వేయడంతో, బైక్ నుంచి కిందపడిన ఓవియా తలకు బలమైన గాయం ఏర్పడింది. ఆమెను వెంటనే ఆస్పత్రికి తరలించగా, అక్కడ ఆమె మెదడు నిర్జీవమైనట్లు వైద్యులు ప్రకటించారు. కుటుంబ సభ్యుల అంగీకారంతో ఓవియా అవయవాలు ప్రత్యేక శస్త్రచికిత్స ద్వారా తొలగించి, ప్రాణాపాయంలో ఉన్న వారికి ఈ అవయవాలు అమర్చనున్నట్లు వైద్యులు తెలిపారు.

తిరునల్వేలిలో...

తిరునల్వేలిలో గత వారం కారు టైర్ పేలిన ఘటనలో గాయపడిన రిషియ (18) చికిత్స పొందుతూ మెదడు నిర్జీవమైనట్లు వైద్యులు గుర్తించారు. బంధువుల అనుమతితో రిషియ అవయవాలను దానంగా పొందారు. ప్రమాద ఘటనలో రిషియ తల్లి మృతిచెందగా, తండ్రి, సోదరి చికిత్స పొందుతున్నారు. కాగా, అవయవదానం చేసిన ఓవియా, రిషియ మృతదేహాలకు ప్రభుత్వం తరఫున ఆయా ఆస్పత్రుల వైద్యులు, సిబ్బంది, ప్రజలు నివాళులర్పించారు.

జాక్టో జియో జిల్లా నేతల సమావేశం



సమావేశంలో పాల్గొన్న నాయకులు

వేలూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): జాక్టో జియో జిల్లా నాయకుల సమావేశం ఆదివారం జరిగింది. సమావేశానికి జిల్లా ఆర్గనైజర్ జోషి అధ్యక్షత వహించగా, జిల్లా నిర్వాహకులు అన్నయన్, శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు. పాత పింఛన్ విధానం అమలు సహా 9 కోర్కెల సాధనకు ఈ నెల 8వ తేది కలెక్టర్‌ను కలుసుకుని వినతిపత్రం సమర్పించాలని సమావేశంలో తీర్మానించారు. సమావేశంలో తమిళనాడు ఉన్నత పాఠశాల టెక్నికల్ విద్య ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జనార్ధనన్, తమిళనాడు ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా సెక్రటరీ శేఖర్, తమిళనాడు అగ్రికల్చరల్ డిగ్రీదారుల సంఘం కోశాధికారి రామన్, తమిళనాడు ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుల జయప్రకాష్ సహా పలువురు పాల్గొన్నారు. డిగ్రీ ఉపాధ్యాయుల సంఘం జిల్లా సెక్రటరీ ధనశేఖరన్ వందన సమర్పణతో సమావేశం ముగిసింది.

తీరానికి కొట్టుకొచ్చిన డాల్ఫిన్ కళేబరం



పెరంబూర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి జిల్లా కూడన్‌కుళం సమీపం కారికోవిల్ తీరానికి డాల్ఫిన్ కళేబరం కొట్టుకొచ్చింది. చూసిన జాలర్లు సముద్రతీర రక్షణా దళం, అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. వెటర్నరీ వైద్యులతో అక్కడకు చేరుకున్న అధికారులు, డాల్ఫిన్ కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించి, తీరంలోనే ఖననం చేశారు. పడవలకు తగిలి డాల్ఫిన్ మృతిచెంది ఉంటుందని అధికారులు తెలిపారు.

ప్రైవేటు విద్యుత్ కొనుగోలుకు అనుమతి

పెరంబూర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు సంస్థల నుంచి 2026 ఫిబ్రవరి నుంచి మే 15వ తేది వరకు విద్యుత్ కొనుగోలు చేసేందుకు విద్యుత్ బోర్డుకు విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ అనుమతిచ్చింది. 2026 వేసవి సీజన్‌లో శాసనసభ ఎన్నికలు జరుగనున్నాయి. ఆ సమయంలో, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసేందుకు ఫిబ్రవరి 1 నుంచి మే 15 వరకు ప్రైవేటు నుంచి విద్యుత్ కొనుగోలుకు అనుమతించాలని విద్యుత్ బోర్డు కమిషన్‌ను కోరింది. విద్యుత్ బోర్డు విజ్ఞప్తి మేరకు విద్యుత్ కొనుగోలుకు కమిషన్ ఆమోదం తెలిపింది. ఆ ప్రకారం, 2026 ఫిబ్రవరి నుంచి ప్రతిరోజు 24 గంటలు 450 మెగావాట్లు, మార్చిలో ప్రతిరోజు 24 గంటలు 950 మెగావాట్లు, సాయంత్రం నుంచి రాత్రి వరకు 1,520 మెగావాట్లు, ఏప్రిల్‌లో ప్రతిరోజు 1,500 మెగావాట్లు, పీక్ అవర్స్‌లో 2,400 మెగావాట్లు, మే 1వ తేది నుంచి 15వ తేది వరకు ప్రతిరోజు 1,500 మెగావాట్లు, పీక్ అవర్స్‌లో 2,400 మెగావాట్ల కొనుగోలుకు విద్యుత్ క్రమబద్ధీకరణ కమిషన్ అనుమతించిందని విద్యుత్ బోర్డు అధికారులు తెలిపారు.

రైలుపై రాళ్లు రువ్విన బాలుడి అరెస్ట్

పెరంబూర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్ సమీపంలో రైలుపై రాళ్లు రువ్విన కేసులో 15 ఏళ్ల బాలుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. కోవై పోతనూరు-ఇరుగూర్ మధ్య గూడ్సు రైలింజన్ అద్దాలు పగులగొట్టిన ఘటన కలకలం రేపింది. ఈ ఘటనపై రైల్వే పోలీసుల ఫిర్యాదుతో పోతనూరు పోలీసులు కేసు నమోదుచేసి చేపట్టిన విచారణలో... సింగనల్లూర్ ప్రాంతానికి చెందిన 15 ఏళ్ల బాలుడు కారణమని తెలిసింది. పోలీసులు బాలుడిని విచారించగా, రాళ్లు వేసింది తానేనని తెలిపినట్లు సమాచారం. దీంతో, పోలీసులు బాలుడిని కోర్టులో హాజరుపరచి, న్యాయమూర్తి ఉత్తర్వులతో పిల్లల భద్రత కమిటీకి అప్పగించారు. బాలుడికి కౌన్సిలింగ్ ఇచ్చి, చదువుకునేలా చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

నేడు దిండివనంలో అన్బుమణి పాదయాత్ర

అడయార్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): పీఎంకే వ్యవస్థాక అధ్యక్షుడు డాక్టర్ రాందాస్ అధ్యక్షతన ఆ పార్టీ క్రమశిక్షణా కమిటీ సమావేశం సోమవారం విల్లుపురం జిల్లా దిండివనం సమీపంలోని తైలాపురంలో జరుగనుంది. మరోవైపు, రాందాస్ తనయుడు డాక్టర్ అన్బుమణి ఆ రోజే దిండివనంలో పాదయాత్ర చేయనున్నారు. గత కొన్ని రోజులుగా తండ్రీకొడుకుల మధ్య ఆధిపత్యపోరు కొనసాగుతోంది. దీంతో ఇరువురు నేతలు వీలు చిక్కినపుడల్లా బలప్రదర్శనలకు దిగుతున్నారు. ఇందులోభాగంగా వారు తమ అనుచరులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ నిబంధనలు ఉల్లంఘించారంటూ ఆయనపై చర్య తీసుకునేందుకు పార్టీ క్రమశిక్షణా కమిటీ సమావేశాన్ని సోమవారం తైలాపురంలో ఏర్పాటు చేయగా, అన్బుమణి మాత్రం దిండివనంలో పాదయాత్ర చేసేందుకు సిద్ధమవడం పీఎంకే నేతల్లో చర్చనీయాంశంగా మారింది.

పాము కాటుకు బాలుడి మృతి

పెరంబూర్, ఆగ స్టు 31 (ఆంధ్రజ్యోతి): పాము కాటుకు ఏడేళ్ల బాలుడు మృతిచెందిన ఘటన తిరువారూర్ జిల్లాలో చోటు చేసుకుంది. మేలనత్తం ప్రాంతానికి చెందిన భాగ్యరాజ్-వినోదిని దంపతుల పెద్ద కుమారుడు కవిన్ ఘటన జరిగిన రోజున ఇంటి ముందు ఆడుకుంటున్న సమయంలో పాము కాటు వేసింది. స్పృహతప్పి పడిపోయిన కవిన్‌ను తల్లిదండ్రులు పేరలం పీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం నన్నిలం ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లగా, అక్కడ చికిత్స ఫలించక బుధవారం కవిన్ మృతిచెందాడు.

ఆదిత్యుడి సేవలో ఎమ్మెల్యే రాజు

అరసవల్లి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామిని కోవిల్‌పట్టి నియోజకవర్గం ఎమ్మెల్యే కడంబూరు రాజు ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకరశర్మ స్వాగతం పలికి దర్శనం చేయించారు. ఈవో ప్రసాదం అందజేశారు.

హత్య కేసులో నలుగురి జీవిత శిక్షలు నిలిపివేత

- మద్రాస్ హైకోర్టు ఉత్తర్వు

అడయార్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం సతీమణి, ప్రముఖ న్యాయవాది నళిని చిదంబరం సమీప బంధువు శివమూర్తి (47) హత్య కేసులో నలుగురికి దిగువ కోర్టు విధించిన జీవిత కారాగార శిక్షలను మద్రాస్ హైకోర్టు తాత్కాలికంగా నిలిపివేసింది.. 2018 జూన్ 25 ఉదయం శివమూర్తి హత్య జరిగింది. ఆ కేసులో కోవై జిల్లాకు చెందిన విమల్ (39), మణికంఠన్ (25), గౌతం (25), మూర్తి (40) అనే నలుగురిని అరెస్టు చేశారు. ఈ కేసుపై విచారణ జరిపిన తిరుపూరు జిల్లా మేజిస్ట్రేట్ కోర్టు వీరందరికీ యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. ఆ తీర్పును సవాలుచేస్తూ నిందితులు హైకోర్టులో అప్పీల్ చేయగా, న్యాయమూర్తులు ఎం.రమేష్, వి.లక్ష్మినారాయణన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపి శిక్షలను తాత్కాలికంగా నిలిపివేయడంతో పాటు వారికి బెయిల్ మంజూరు చేయాలని దిగువ కోర్టును ఆదేశించింది.

పాల కొనుగోలు ధర పెంచాలి



పాడి పశువులతో ధర్నా చేపట్టిన రైతులు

పెరంబూర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): పాలు కొనుగోలు ధర పెంచాలంటూ రైతులు ధర్నా చేపట్టారు. తంజావూరు జిల్లా ఆదనూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయానికి శనివారం పాడి పశువులతో ర్యాలీగా వచ్చిన రైతులు రోడ్డుపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ... ప్రభుత్వ, ప్రైవేటు పాల డైరీలు లీటరు రూ.25 నుంచి రూ.35 వరకు కొనుగోలు చేస్తున్నాయన్నారు. ప్రస్తుతం పశువుల దాణా, వైద్య ఖర్చులు పెరిగాయని, అందువల్ల ప్రస్తుత ధరతో వ్యాపారం చేయలేకున్నామని తెలిపారు. ఆవు పాల ధర లీటరు రూ.50, గేదె పాల ధర రూ.75గా ప్రభుత్వం నిర్ణయించాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతిపత్రాన్ని అధికారులకు సమర్పించినట్లు రైతులు తెలిపారు.

మాదకద్రవ్యాల అనర్థాలపై ప్రచారం

వేలూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోట మానగర లయన్స్ సంఘం, వేలూరు ఓఎంఆర్ పాఠశాల సంయుక్త ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల అనర్థాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయం వద్ద ఈ ర్యాలీని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జ్ఞానకుమార్ ప్రారంభించారు. కలెక్టర్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ గాంధీ నగర్, ఆవిన్, ఆర్టీవో కార్యాలయం మీదుగా ఎంజీఆర్ విగ్రహం వరకు సాగింది. కార్యక్రమంలో మేయర్ సుజాత, కార్పొరేటర్లు సుమతి, చక్రవర్తి, లయన్స్ సంఘం నిర్వాహకులు అరుణ్ కుమార్, షణ్ముగసుందరం, మణిభారతి, వెంకటేశన్, కార్తికేయన్, జయవేల్, జీవరత్నం, సిలంబు పాఠశాల ప్రిన్సిపాల్ కేశవులు సహా పలువురు పాల్గొన్నారు.

వేడుకగా ముత్యాలమ్మ ఆలయ వేడుకలు



అన్నదానం ప్రారంభిస్తున్న డాక్టర్ సునీల్

పెరంబూర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక థౌజండ్ లైట్స్ సమీపం రామకృష్ణాపురంలోని దేవి ముత్యాలమ్మన్ ఆలయ 75వ ఆడి వేడుకలు వైభవంగా జరిగాయి. వేడుకల్లో భాగంగా భక్తులు పాలకలశాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంజీఆర్ యువజన విభాగం సంయుక్త కార్యదర్శి డా.సునీల్ ప్రారంభించారు. కార్యక్రమ ఏర్పాట్లను 117వ వార్డు అన్నాడీఎంకే శాఖ కార్యదర్శి పోస్టాఫీసు చిన్నయ్య పర్యవేక్షించగా, మాజీ కౌన్సిలర్ నుంగై మారన్, నిర్వాహకులు బి.మనోహరన్, డి.మారి, ఎం.పొయ్యాదు, కె.యశోద, వలర్మతి, ఆరాయి, పి.కళ సహా భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా చూళై తెలుగు బాపిస్టు సంఘ వార్షికోత్సవం



సత్కార గ్రహీతలతో నిర్వాహకులు

ప్యారీస్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక చూళై కాట్బూరు నల్లముత్తువీధిలో ఉన్న చూళై తెలుగు బాపిస్టు సంఘం 76వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. సీనియర్ కాపరి రెవ.డా.ఎం.పాల్ ఈశ్వరప్ప ప్రత్యేక ప్రార్థనలతో ఆలయ 15వ పునర్నిర్మాణం, 76వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ నిర్మాణంలో సహాయ సహకారాలు అందించిన నిర్వాహకులు, సభ్యులకు జ్ఞాపికలు అందజేసి ఘనంగా సత్కరించారు. శనివారం రాత్రి అసిస్టెంట్ పాస్టర్ రెవ.వి.జేసుదాసు, సంఘ నిర్వాహకుల సమక్షంలో జరిగిన ఆలయ పునర్నిర్మాణ ప్రత్యేక సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ఒంగోలులోని 'ది లార్డ్స్ చర్చి' పాస్టర్ ఇ.సురేష్‌కుమార్ పాల్గొని ప్రసంగించారు. సంఘ చైర్మెన్ జి.సురేష్‌కుమార్, వైస్ చైర్మెన్ ఎ.లాబాను, కార్యదర్శి ఎం.డి.వీరరాజు, కోశాధికారి వి.యేసుదాస్, ఉపకార్యదర్శి పి.ప్రభుదాస్ ఏర్పాట్లను పర్యవేక్షించి అందరికి స్వీట్లు పంపిణీ చేశారు.

రైల్లో దొరికిన 50 సవర్ల నగలు

- యజమానికి అప్పగించిన రైల్వే కానిస్టేబుల్



పెరంబూర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రైలు బోగీలో ప్రయాణికులు పోగొట్టుకున్న 50 సవర్ల నగలు, నగదు, సెల్ ఫోన్‌ను రైల్వే కానిస్టేబుల్ వాటి యజమానులకు అప్పగించాడు. కోవై శారద మిల్ రోడ్డుకు చెందిన రవికుమార్, చెన్నై నుంచి కోవైకు భార్య, పిల్లలతో రైలులో బయల్దేరారు. రైలు కోవై చేరుకున్న తర్వాత బ్యాగులతో వారు కిందకు దిగారు. బ్యాగు కనిపించకపోవడంతో దిగ్భ్రాంతి చెందారు. అదే సమయంలో, రైలు పెట్టెలు తనిఖీ చేస్తున్న రైల్వే కానిస్టేబుల్ మణికంఠన్‌కు ఓ పెట్టెలో కనిపించిన బ్యాగు పరిశీలించి నగలు, నగదు, సెల్‌ఫోన్ గుర్తించి ఉన్నతాధికారులకు అప్పగించారు. అధికారులు, ఈ వస్తువులు రవి కుమార్‌విగా నిర్ధారించుకుని, అతడిని కార్యాలయానికి రప్పించి 50 సవర్ల నగలు, రూ.22 వేలు నగదు, ఖరీదైన సెల్‌ఫోన్ అప్పగించారు. రైల్వే కానిస్టేబుల్ మణికంఠన్‌ను ఉన్నతాధికారులు అభినందించారు.

గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కోలాటం



తిరుత్తణి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు వానియర్‌వీధిలో గణేష్ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గణపతి ఉత్సవ కమిటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో కోలాటం నిర్వహించారు. ఆదివారం సాయంత్రం 7 గంటలకు గణేశుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి మండపానికి వచ్చిన భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిటీ నిర్వాహకులు మాట్లాడుతూ, గత కొన్నేళ్లుగా గణేష్ ఉత్సవాలు నిర్విరామంగా నిర్వహిస్తున్నామని, రాబోయే కాలంలో మరింత గొప్పగా గణేష్ చతుర్థి వేడుకలు నిర్వహించే ప్రయత్నం చేస్తామని తెలిపారు. కమిటీ నిర్వాహకులు భరత్, దివాకర్, వంశీ, రవి, శరవణ, చరణ్, వినోద్, తిలక్, అభిషేక్, యోగేష్, ఉత్తం, విశాల్, యువరాజ్, విక్కీ, హరీష్, గౌతమ్, కార్తిక్ పాల్గొన్నారు.

ఘననాథుడి విగ్రహాలకు ఘనంగా వీడ్కోలు









నగరంలోని పలు ప్రాంతాల నుంచి సముద్ర తీరానికి చేరిన విగ్రహాలు





భారీగా ప్రతిమల నిమజ్జనం

16,500 మంది పోలీసులతో బందోబస్తు

కిక్కిరిసిన సాగర తీరం

ప్యారీస్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి సందర్భంగా నగర వ్యాప్తంగా కొలువుదీర్చిన విగ్రహాల నిమజ్జనం ఆదివారం భారీస్థాయిలో సాగింది. నగరంలోని 200 వార్డులు, ముస్లింలు, క్రైస్తవులు అధికంగా నివసిస్తున్న ఎగ్మూర్, పెరియమెట్టు, పురుషవాక్కం, రాయపురం, రాయపేట, ఐస్ హౌస్, థౌజండ్ లైట్స్‌తో పాటు నిమజ్జనం ప్రాంతాల్లో పటిష్ట బందోబస్తు ఏర్పాటు అయ్యింది. కాగా, మద్రాస్ హైకోర్టు, పోలీసుశాఖ విధించిన నిబంధనలు పాటిస్తూ గత 27న హిందూ సంస్థల ఆధ్వర్యంలో 1,500 గణేష్ విగ్రహాలను నిలిపి భక్తితో పూజలు నిర్వహించారు. నాలుగు పూజల అనంతరం ఆదివారం గణనాథుడి విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు ఊరేగించగా, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. రాయపురం నియోజకవర్గంలోని కాశిమేడు ఫిషింగ్ హార్బర్, మైలాపూర్ లైట్ హౌస్ సమీపంలోని శ్రీనివాసపురం, పట్టినంబాక్కం, తిరువాన్మియూర్, తిరువొత్తియూర్, ఈస్ట్‌కోస్ట్ రోడ్డు పాలవాక్కం సముద్రతీరాల్లో ఉదయం 10 నుండి రాత్రి 8 గంటల వరకు క్రేన్ల ద్వారా బొజ్జగణపయ్య విగ్రహాల నిమజ్జనం ప్రశాంతంగా జరిగింది. మెరీనా సముద్రతీరంలో మాత్రం 1,565 విగ్రహాలను జైజై గణేశ అంటూ భక్తుల సందడి, డప్పు వాయిద్యాల మధ్య ఘనంగా వీడ్కోలు పలికారు. ఊరేగింపు సాగిన మార్గాల్లో ప్రజలకు అన్నదానం ప్రసాదాలు పంపిణీ చేశారు. నిమజ్జనం ఊరేగింపు నేపథ్యంలో ఆదివారం ట్రిప్లికేన్, శాంథోమ్, మైలాపూర్ లజ్‌కార్నర్, అడయార్, రాయపేట, రాయపురం, మింట్ తదితర ప్రాంతాల్లో వాహనాల రాకపోకలను తాత్కాలికంగా నిషేధించారు.

వీఐటీ వర్సిటీలో 'ఓనం' సందడి

వేలూరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక వీఐటీ విశ్వవిద్యాలయంలో 'ఓనం' వేడుకలు సందడిగా సాగాయి. వర్సిటీ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన వేడుకలకు వర్సిటీ ఉపాధ్యక్షులు శేఖర్ ఆహ్వానం పలుకగా, ఛాన్సలర్ విశ్వనాథన్ వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఛాన్సలర్ మాట్లాడుతూ... వర్శిటీలో 24 ఏళ్లుగా ఓనం వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. మొదట తమ వర్సిటీలో కేరళ రాష్ట్రానికి చెందిన 180 మంది విద్యార్థులు చదువుతుండగా, ప్రస్తుతం 4,160కి పెరిగారన్నారు. కేరళలో నంబూద్రి భట్ నేతృత్వంలోని ఏర్పడిన కమ్యూనిస్ట్ ప్రభుత్వం విద్యారంగానికి పెద్ద పీట వేసిందన్నారు. వైద్య రంగంలోనూ ఆ రాష్ట్రం మంచి ప్రగతి సాధించిందన్నారు. వేడుకల్లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రముఖ నేపథ్యగాయని రమ్యానంబీసన్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా రమ్యా నంబీసన్ పాడిన మలయాళం పాటలకు విద్యార్థులు కరతాళధ్వనులు చేశారు. కార్యక్రమంలో వీఐటీ వైస్ ఛాన్సలర్ కాంచన భాస్కరన్, వైస్, ప్రొ ఛాన్సలర్ పార్థసారథి మల్లిక్, రిజిస్ట్రార్ జయభారతి, విద్యార్థుల సంక్షేమ శాఖ డెరక్టర్ నైజు పాల్గొన్నారు. వేడుకల ఆర్గనైజర్ జగదీశన్ వందన సమర్పణతో వేడుకలు ముగిశాయి.



వేడుకలు ప్రారంభిస్తున్న ఛాన్సలర్ విశ్వనాథన్, రమ్యా నంబీసన్ తదితరులు

వేడుకల్లో పాల్గొన్న విద్యార్థినులు



'యోలో' ఆడియో రిలీజ్ దృశ్యం

కొత్త నటీనటులతో 'యోలో' మూవీ

ఎంఆర్ మోషన్ పిక్చర్స్ పతాకంపై మహేష్ సెల్వరాజ్ నిర్మాణంలో దర్శకుడు ఎస్.శ్యామ్ దర్శకత్వంలో కొత్త నటీనటులు నటించిన 'యోలో' చిత్రం ఆడియో, ట్రైలర్ తాజాగా రిలీజ్ చేశారు. హృదయాన్ని హత్తుకునేలా రొమాన్స్ కామెడీతో రూపొందించిన ఈ వినోదాత్మక చిత్రం ఈ నెల 12న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ చిత్రం ఆడియో, ట్రైలర్ రిలీజ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పెఫ్సీ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి, ప్రత్యేక ఆహ్వానితులుగా నటుడు, దర్శకుడు సముద్రఖని, దర్శకులు అమీర్, శ్యామ్ తో పాటు పలువురు సినీ ప్రముఖులు పాల్గొన్నారు. వీరితో పాటు నిర్మాత మహేష్, జనరస్ ఎంటర్‌టైన్మెంట్ ప్రతినిధి గోకుల్, నటులు హార్ట్ బీట్ గిరి, ఆకాష్ ప్రేమ్, బడవ గోపి, నటి దేవిక తదితరులు పాల్గొన్నారు. కాగా, ఈ చిత్రంలో దేవ్, దేవిక హీరోహీరోయిన్లుగా నటించారు.

చిత్రజ్యోతి

ఘనంగా పంచరిమేళం అరంగేట్రం



చిన్నారి శ్రేష్ఠకు జ్ఞాపిక అందజేస్తున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి సి.రాజేంద్రన్ తదితరులు

ప్యారీస్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నానగర్‌లోని అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో పంచరిమేళం అరంగేట్రం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. కేరళ సంప్రదాయ సంగీతంలో ప్రసిద్ధి చెందిన పంచరిమేళంలో వాద్య కళారత్న దేవరాజ్ మరార్ దగ్గర శిక్షణ సొందించిన 16 మంది యువ కళాకారుల అరగేట్రం శనివారం సాయంత్రం ఘనంగా జరిగింది. అన్నానగర్ అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలోని వేదికపై జరిగిన పంచరిమేళంలో చిన్మయ విద్యాలయంలో 7వ తరగతి చదువుతున్న విద్యార్థిని శేష్ఠతో పాటు శిక్షణ పొందిన చిన్నారుల అరంగేట్రం కార్యక్రమం గురువందనంతో ప్రారంభమైంది. అనంతరం మొదటి బ్యాచ్‌కు చెందిన 16 మంది విద్యార్థులు గురువు దేవరాజ్ మరార్ ఆశీర్వాదం తీసుకుని అరంగేట్రం ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి సి.రాజేంద్రన్ అన్నానగర్ అయ్యప్ప సేవాసంఘం నిర్వాహకులతో కలిసి అరంగేట్రం ప్రదర్శించిన చిన్నారి శ్రేష్ఠతో సహా విద్యార్థులందరికి జ్ఞాపికలందించి ఘనంగా సత్కరించి అభినందించారు.



పంచరిమేళం ప్రదర్శిస్తున్న కళాకారులు

జలపాతాల హోరు.. పర్యాటకుల జోరు





కుట్రాలంలో స్నానాల కోసం బారులు దీరిన పర్యాటకులు

మేఘమలై జలపాతం వద్ద సందడి

చెన్నై, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని జలపాతాల వద్ద పర్యాటకుల సందడి నెలకొంది. వరుస సెలువులు రావడంతో జలపాతాల హోరులో ప్రకృతి అందాలను ఆశ్వాదించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి పర్యాటకులు రావడంతో పర్యాటక ప్రాంతాలన్నీ కళకళలాడాయి. తేని జిల్లా మేఘమలై జలపాతానికి ఆదివారం ఉదయం నుంచి రద్దీ అధికమైంది. వరుసనాడు, వెళ్ళిమలై తదితర మూలికా వనాలున్న ప్రాంతాల్లో కురిసే వర్షపు నీరంతా ఈ జలపాతంలో కలుస్తుంది. దీంతో కుట్రాలం జలపాతం లాగే మేఘమలై జలపాతంలో నీరు కూడా వంటికి మంచిదని పర్యాటకులు భావిస్తుంటారు. గత మూడురోజులుగా మురుసనాడు, వెళ్ళిమలై ప్రాంతంలో భారీగా వర్షాలు కురువటంతో మేఘమలై జలపాతం వద్ద నీటి ప్రవాహం ఎగసిపడుతోంది. జలపాతం వద్ద స్నానం చేయడానికి బారులు తీరారు. ఇదిలా ఉండగా తెన్‌కాశి జిల్లా కుట్రాలం జలపాతం వద్ద ఆదివారం వేకువజాము నుంచే వరద ఉధృతి నెలకొంది. కుట్రాలం పరిసర ప్రాంతాల్లో రెండు రోజులుగా కురిసిన కుండపోత వర్షాల వల్ల జలపాతంలో నీటి ప్రవాహం ఉధృతంగా ఉండడంతో మధ్యాహ్నం వరకు పర్యాటకులను స్నానం చేయకుండా అనుమతించలేదు. మధ్యాహ్నం తర్వాత పర్యాటకులను స్నానానికి అనుమతించారు.

దీపావళి రేస్‌లో 'డీజల్'

హరీష్ కళ్యాణ్ హీరోగా నటించిన 'డీజల్' చిత్రం దీపావళి రేస్‌లో చేరింది. షణ్ముఖ ముత్తుస్వామి దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం ప్రమోషన్ కార్యక్రమాలను ఇప్పటికే చేపట్టారు. ఈ సినిమా ఫస్ట్ సింగిల్ రిలీజ్ చేయగా ఈ సినిమా విడుదల తేదీని అధికారికంగా ప్రకటించింది. పూర్తి యాక్షన్ భరిత మూవీగా రూపొందించారు. ఇందులో అతుల్యా రవి హీరోయిన్‌గా, వినయ్ రాయ్, సాయి కుమార్, కరుణాస్, రమేష్ తిలక్ తదితరులు నటించారు.



'డీజల్'లో హరీష్ కళ్యాణ్

మిష్కిన్ దర్శకత్వంలో కీర్తి సురేష్



హీరోయిన్ కీర్తి సురేష్ వివాహం తర్వాత వరుస చిత్రాలతో బిజీ అయిపోతోంది. ఇందులోభాగంగా ఆమె మిష్కిన్ దర్శకత్వంలో నటించనున్నారు. డ్రమ్ స్టిక్ నిర్మాణ సంస్థ ఈ లేడీ ఓరియంటెడ్ సినిమా నిర్మించనుంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రీప్రొడక్షన్ నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. దీనికి సంబంధించి పూర్తి వివరాలతో అధికారికంగా ప్రకటన రానున్నట్లు సమాచారం. మరోవైపు, కీర్తి సురేష్ నటించిన 'రివాల్వర్ రీటా' విడుదలకు సిద్ధంగా ఉంది. అలాగే, మిష్కిన్ రూపొందించిన 'ట్రైన్', 'పిశాచు-2' మూవీలు నిర్మాణాలు పూర్తి చేసుకునివున్నాయి.

కేఎస్‌జీ సాంకేతిక కళాశాలలో ఆకట్టుకున్న 'ఇంజీనియస్' పోటీలు

చెన్నై, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కేఎస్‌జీ సాంగకేతిక కళాశాలలో 'ఇంజీనియస్-25' పేరుతో నిర్వహించిన పోటీలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ పోటీలలో నగరానికి చెందిన 31 పాఠశాలలకు చెందిన 2753 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల ఫైనల్స్ అట్టహాసంగా ముగిశాయి. ఈ వేడుకలకు ప్రాథమిక పాఠశాలల విద్యాశాఖ మంత్రి అన్బిల్‌మహేష్, డీవైఎస్ఎల్-సీటీ డైరెక్టర్ మనిష్ ప్రతాప్ సింగ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ పోటీల్లో వివిధ కళాశాలలకు చెందిన విదార్థులు తాము రూపొందించిన వివిధ సాంకేతిక పరికరాలను ప్రదర్శించారు. హిందూస్థాన్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూటషన్స్ చైర్మన్ డాక్టర్ ఆంద్ జేకబ్ వర్గీస్, కేఎస్‌జీ సాంకేతిక కళాశాల డైరెక్టర్ డాక్టర్ అన్నీ జేకేబ్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. ముత్తుకన్నన్ తదితరులు పాల్గొన్నారు.

పోటీల్లో పాల్గొన్న బాలికలకు నగదు కానుక అందజేస్తున్న మంత్రి అన్బిల్ మహేష్ ⟷



భాషోద్యమంలో గిడుగు పాత్ర కీలకం

● తెలుగు భాషా దినోత్సవంలో అజంతా శంకరరావు



విజేతలతో కాట్రగడ్డ ప్రసాద్, సమత ముళ్లమూడి, అజంతా కె.శంకరరావు తదితరులు

ప్యారీస్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి):భాషోద్యమంలో గిడుగు రామ్మూర్తి పంతులు పాత్ర చాలా కీలకమైనదని, మధురమైన మన తెలుగు భాషను పరిరక్షించుకోవాలని అమరజీవి పొట్టిశ్రీరాములు స్మారక సమితి అధ్యక్షులు అజంతా డాక్టర్ కనిగెలుపుల శంకరరావు అన్నారు. మైలాపూర్‌లోని ఆంధ్ర మహిళా సభ వేదికగా 'నెలనెలా వెన్నెల' కార్యక్రమంలో భాగంగా తెలుగు భాషా దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గిడుగు వారి సేవలను స్మరించుకుని ఘన నివాళులర్పించారు. సభాధ్యక్షుడిగా వ్యవహరించిన అజంతా శంకరరావు మాట్లాడుతూ, సమితి తరుఫున రెండున్నర దశాబ్దాలుగా తెలుగు మీడియం విద్యార్థుల్లో మాతృభాషపై మరింత మమకారాన్ని పెంచుతూ సాహిత్య పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాగా అమరజీవి పొట్టిశ్రీరాములు స్మారక సమితి ఆధ్వర్యంలో తెలుగు భాషా సాహిత్యాలను భావితరాలకు అందించడానికి, భాషా పరిరక్షణకు 23యేళ్లుగా నిర్విరామంగా తెలుగు విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా నిర్వహించిన అంతర్ పాఠశాలల తెలుగు భాషా సాహిత్య పోటీల్లో నగరంలోని 11 పాఠశాలలకు చెందిన 151 మంది విద్యార్థులు పాల్గొనగా అందులో 68 మంది విజేతలుగా నిలిచారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన ప్రముఖ సినీ నిర్మాత కాట్రగడ్డ ప్రసాద్, చెన్నై ఇన్‌కంటాక్స్ అసిస్టెంట్ కమిషనర్ సమత ముళ్లమూడి విజేతలకు బహుమతులు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. అరుణా శ్రీనాథ్ స్వాగతోపన్యాసంతో ప్రారంభమైన ఈ కార్యక్రమం వ్యాఖ్యాతగా ప్రొఫెసర్ డాక్టర్ తుమ్మపూడి కల్పన వ్యవహరించగా సమితి ఉపాధ్యక్షులు డా.దిట్టకవి అనంతపద్మనాభమూర్తి, కార్యవర్గ సభ్యులు జయశ్రీ, గుర్రం బాలాజీ, సీహెచ్. శివసుబ్రహ్మణ్యం తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఎన్ఐఈపీఎండీలో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

ప్యారీస్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఈస్ట్‌కోస్ట్ రోడ్డులోని ముట్టుకాడు ప్రాంతంలో ఉన్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ మల్టీపుల్ డిజేబులిటీస్ (ఎన్ఐఈపీఎండీ) చెన్నై క్యాంపస్‌లో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దివంగత మేజర్ ధ్యాన్‌చంద్ భారత హాకీ జట్టుకు సారథ్యం వహించి 1928, 1932, 1936 ఒలంపిక్స్‌లో బంగారు పతకాలు సాధించిన దానికి గుర్తుగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని కేంద్రప్రభుత్వం ప్రకటించింది. ఈ క్రమంలో ముట్టుకాడులో ఉన్న ఎన్ ఐ ఈ పీ ఎం డీ కేంద్రంలో సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ హోమియోపతి మినిస్ట్రీ ఆఫ్ ఆయుష్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా నిర్వహణలోని ఎన్ఐఈపీఎండీ క్యాంపస్‌లో శుక్ర, శని ఆదివారాల్లో నిర్వహించిన క్రీడా పోటీల్లో ఆ కేంద్రానికి చెందిన అధికారులు, ఉద్యోగులు, 25 మందికి పైగా ఉత్సాహంగా పాల్గొన్నారు. వీరిలో 15 మంది క్రీడల్లో ప్రతిభ కనబరిచి పతకాలు కైవసం చేసుకున్నారు. ముఖ్యఅతిథిగా పారాలింపిక్స్ ఛాంపియన్ ఎస్.కృష్ణమూర్తి పాల్గొనగా, హెచ్ఆర్ఐడీ చెన్నై ఆఫీస్ ఇన్‌ఛార్జి డాక్టర్ డి.కార్తికేయన్, డాక్టర్ కొల్లి రాజు, ఫిజికల్ ట్రైనింగ్ టీచర్ యూ.రమేష్‌కుమార్ తదితరులు పాల్గొని విజేతలను అభినందించారు. ముందుగా మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలు చల్లి నివాళులర్పించారు.



ప్రతిజ్ఞ చేస్తున్న క్రీడాకారులు

నట్టి - అరుణ్ పాండ్యన్ ప్రధాన పాత్రల్లో 'రైట్'

సీనియర్ దర్శక నటుడు అరుణ్ పాండియన్, నటుడు నట్టి నటరాజ్ ప్రధాన పాత్రల్లో నటించిన తాజా చిత్రం రైట్. సుబ్రమణియన్ రమేష్ కుమార్ దర్శకత్వంలో థ్రిల్లర్ జానర్‌లో తెరకెక్కిస్తున్నారు. సాధారణ ప్రజలకు ఏ చిన్న సమస్య ఉత్పన్నమైనా పోలీస్ స్టేషన్‌కు వెళ్ళి సాయం కోరుతారు. ఈ సాయం అడిగేందుకు వెళితే అక్కడ మరో సమస్య ఉత్పన్నమైతే ఏమవుతుంది? అనేదే ఈ చిత్ర ప్రధాన కథ. 'జిల్లా', 'పులి' చిత్రాలకు అసోసియేట్ దర్శకుడిగా పనిచేసిన సుబ్రమణియన్ రమేష్ కుమార్ ఈ చిత్రం ద్వారా వెండి తెరకు పరిచయంకానున్నారు. 'బిగ్‌బాస్' ఫేం అక్షర రెడ్డి, వినోదిని, మూనారు రమేష్, టైగర్ తంగదురై, ఉదయ్ మహేష్ తదితరులు నటించారు. 'వీరమ్'లో బాలనటిగా నటించిన యువినా పార్వతి ఈ చిత్రంలో కాలేజీ విద్యార్థినిగా నటించారు. 'వంశం' వంటి అనేక చిత్రాల్లో నటించిన అనుపమ కుమార్ కుమారుడు ఆదిత్య శివక్ ఈ చిత్రం ద్వారా వెండితెరకు పరిచయమవుతున్నారు. ఇప్పటికే ఈ మూవీ ఫస్ట్‌లుక్ రిలీజ్ చేశారు.



'రైట్'లో నట్టి, అరుణ్ పాండియన్